క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు: చాపాడు, బ్రహ్మంగారిమఠం మండలాల్లో ఒక అంగన్‌వాడీ వర్కర్, రెండు చోట్ల ఆయా పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సావిత్రమ్మ తెలిపారు. చాపాడు మండలంలోని నరహరిపురం అంగన్‌వాడీ కేంద్రంలో వర్కర్(ఎస్సీ), వెదురూరులో హెల్పర్(బీసీ–ఏ), బ్రహ్మంగారిమఠం మండలంలోని నరసన్నపల్లె హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (వీహెచ్) పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వర్కర్ పోస్టుకు 10వ తరగతి, హెల్పర్ పోస్టుకు 7వ తరగతి అర్హతతో ఈ నెల 17వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తమ కార్యక్రమంలో పత్రాలను అందజేయాలని సీడీపీఓ తెలిపారు.

మాజీ ఎంపీపీకి నివాళి



ఓబయ్య భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

దువ్వూరు : దువ్వూరు మండల మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్య యాదవ్(65) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి నడిపి ఓబయ్య కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్య భౌతికకాయాన్ని రాష్ట్ర ప్రభుత్వ మాజీ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ చిరాకి బాషా, బీసీ కన్వీనర్ జెర్రి హరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, నాయకులు పీవీ రమణయ్య నాయుడు, సంగన హరినాథరెడ్డి సందర్శించి నివాళి అర్పించారు.

అంకాలమ్మ, పోలేరమ్మకు బోనాలు



అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయంలో కమిటీ సభ్యులు

పోరుమామిళ్ల: రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లోని అంకాలమ్మ, పోలేరమ్మ గ్రామ దేవతలకు ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయాలకు బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రెడ్డినగర్‌లోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు.


కళాభూషణ్ అవార్డు ప్రదానం



కళాభూషణ్ అవార్డు అందుకుంటున్న కంభం పాములేటి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ కళాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటికి కళాభూషణ్ జాతీయ అవార్డు లభించింది. బళ్లారిలోని బసవ రాజేశ్వరి పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం బళ్లారి కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ వారు 52వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో పాములేటి 42 సంవత్సరాలుగా జానపదరంగంలో, నాటక రంగంలో చేస్తున్న కృషి, సేవకు గాను సంస్థ అధ్యక్షుడు సీలా బ్రహ్మయ్య, బళ్లారి గురుపీఠం అధిపతి కల్యాణ స్వామి కళాభూషణ్ అవార్డును అందజేశారు. ఈయనకు జాతీయ స్థాయి అవార్డు రావడం పట్ల పలువురు కళాకారులు, కళాభిమానులు, పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న శూలం లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : స్థానిక విద్యార్థి ఫౌండేషన్ ఆశ్రమంలో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో సుబ్బిగారి హర్షిత 11వ పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, కొండయ్య, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

ప్రొద్దుటూరు క్రైం : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని త్రీ టౌన్ ఎస్‌ఐగా కేవీబీ వెంకటరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు త్రీ టౌన్ ఎస్‌ఐ–2గా వెంకటరెడ్డి ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ స్టేషన్‌లో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సత్యకుమార్ మాటలు బాధ్యతారాహిత్యం



మంత్రి సత్యకుమార్ బాధ్యతారాహిత్యం వ్యవహరిస్తున్నారు. మెడికల్ కళాశాలలను పరిశీలించకుండా విద్యార్థుల అభిప్రాయాలు సేకరించకుండానే ఆయన అసత్య ఆరోపణలు చేయడం తగదు. కేంద్ర ప్రభుత్వం కళ్లు ఉండి చూడలేని, చెవులు ఉండి వినలేని స్థితిలో ఉంది. జాతీయ స్థాయి మెడికల్ కళాశాలలను రాష్ట్రాల వారీగా ఏర్పాటు చేసే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. రాష్ట్రాలకు సంబంధించి మెడికల్ కళాశాలల నిర్మాణంలో మాకు సంబంధం లేదన్నట్లుగా కేంద్రం వ్యవహరిస్తోంది. – గంజికుంట నాగరాజు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేదిక కన్వీనర్, టంగుటూరు గ్రామం, రాజుపాళెం మండలం



సత్యకుమార్ వ్యాఖ్యలు సరికాదు



నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం వైద్య విద్యను ప్రోత్సహిస్తే దానిని సమర్థించకుండా మంత్రి సత్యకుమార్ వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదు. కూటమి ప్రభుత్వం ఈ విధంగా చర్య తీసుకోవడం దారుణం. కేంద్రానికి రాసిన లేఖను తక్షణమే ఉపసంహరించుకోవాలి. నిరుపేద విద్యార్థులు వైద్య విద్యను ప్రభుత్వ కళాశాలల్లో చదవకుండా వైద్య విద్యకే టీడీపీ ప్రభుత్వం దూరం చేయడానికి ప్రయత్నించడం తగదు. రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 వైద్య కళాశాలలను మంజూరు చేసింది. వాటిలో ఐదు ప్రభుత్వ కళాశాలలు, 12 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. – నేట్లపల్లె శివరామ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మైదుకూరు

రహదారికి మోక్షం.. అద్దె ఇంట్లో పాఠం

- రోడ్డు విస్తరణలో పాఠశాల కూల్చివేతకు నిర్ణయం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేయబడనున్న చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాల

బద్వేలు అర్బన్ : కొన్నేళ్లుగా ఎంతో మంది విద్యార్థులను అక్కున చేర్చుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పిన చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాల భవనాన్ని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. అధికారుల నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది.

సుదీర్ఘ చరిత్ర

మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో 1958లో బద్వేలు – మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె వద్ద పాఠశాల భవనం నిర్మించారు. ఈ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించి వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 64 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారు.

శాపంగా రోడ్డు విస్తరణ పనులు

బద్వేలు పట్టణంలో జరుగుతున్న ఎన్‌హెచ్–67 రోడ్డు విస్తరణ పనులు, బైపాస్ రోడ్డు పనులు చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాలకు శాపంగా మారాయి. నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా పాఠశాలను కూల్చివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎన్‌హెచ్ అధికారులు మార్కింగ్ ఇవ్వడంతో పాటు విస్తరణ పనులు పాఠశాల పరిసరాల్లో కొనసాగుతున్నాయి. కొద్దిరోజుల్లోనే పాఠశాల భవనాన్ని తొలగించనున్నారు. పాఠశాల కూల్చివేతకు సంబంధించి నష్టపరిహారాన్ని డీఈఓ అకౌంట్‌లో జమ చేశారు. అయితే రెవెన్యూ, విద్యాశాఖాధికారులు రోడ్డు విస్తరణ పనుల కాంట్రాక్టర్‌తో మాట్లాడి కొద్ది రోజులు గడువు కోరారు. గ్రామంలో ఓ అద్దె భవనంలో పాఠశాల కొనసాగించేందుకు అధికారులు నిర్ణయించి ఆ మేరకు భవనాన్ని కూడా గుర్తించారు. అయితే రోడ్డు విస్తరణ పనుల్లో పాఠశాల భవనాన్ని తొలగిస్తారని చెబుతున్నారే తప్పా.. నూతన పాఠశాల భవనాన్ని ఎక్కడ నిర్మిస్తారో సమాచారం ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంవత్సరాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకొని త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

భవనాలు త్వరగా నిర్మించాలి



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేయబడుతున్న పాఠశాల భవనాల స్థానంలో గ్రామంలోనే మరోచోట నూతన భవనాలు త్వరగా నిర్మించాలి. గ్రామంలో విద్యార్థులకు అందుబాటులో ఉండే పాఠశాల కూల్చివేయాలని నిర్ణయం తీసుకోవడంతో బాధగా ఉంది. అధికారులు స్పందించి త్వరగా నూతన పాఠశాల భవనాలను నిర్మించాలి.

–యశోద, చెన్నంపల్లె

ఇబ్బందులు లేకుండా చూడాలి



64 మంది విద్యార్థులు చెన్నంపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా పాఠశాల భవనం తొలగించి అద్దె భవనంలో కొనసాగిస్తామంటే విద్యార్థులు ఇబ్బందులు పడతారు. పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా త్వరగా నూతన పాఠశాల భవనాలు నిర్మించాలి. విద్యార్థులు నష్టపోకుండా చూడాలి.

–బి.మహేశ్వరి, చెన్నంపల్లె

త్వరగా నిర్మిస్తాం



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాల భవనం కూల్చివేతకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే పాఠశాల నూతన భవనానికి తహసీల్దారు స్థలం కూడా కేటాయించారు. వీలైనంత త్వరగా జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి నూతన పాఠశాల భవనాలు త్వరగా నిర్మిస్తాం.

–చెన్నయ్య, ఎంఈఓ, బద్వేలు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

కాశినాయన: భవిష్యత్ అంతా మనదేనని, కార్యకర్తలెవ్వరూ అధైర్య పడవద్దని అండగా ఉంటామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం మండలంలోని గంగనపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరెడ్డిని గోవిందరెడ్డి పరామర్శించారు. అలాగే నరసాపురం గ్రామానికి చెందిన పార్టీ అభిమాని వెంకటేశ్వర్లును కూడా ఎమ్మెల్సీ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి జేసీఎస్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి సిద్దారెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి

పోరుమామిళ్ల: మాజీ ఎంపీపీ పి. బాలయ్య (76) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మృతుడి ఇంటికి వెళ్లారు. బాలయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ వెంట వైస్ ఎంపీపీ సీఎం బాషా, ఎంపీటీసీ ఇస్సాక్, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, నాయకులు బ్రహ్మయ్య, గంగయ్య, సుబ్బారావు, పట్టాభి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 2000-01 బ్యాచ్ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి రాయలసీమ వ్యాయామ కళాశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 24 సంవత్సరాల తరువాత కలిసి చదువుకున్న విద్యార్థులు తాము చదువుకున్న కళాశాలలో ఉత్సాహంగా సమ్మేళనంలో పాల్గొన్నారు. అప్పటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం లక్ష్మీకాంతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, విశ్రాంత ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, విశ్రాంత ఆచార్యుడు కరిముల్లా, పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి శంకర్‌రెడ్డి, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

బద్వేలు అర్బన్ : పన్నెండవ పీఆర్సీ అమలులో జరుగుతున్న తీవ్ర జాప్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని సుభాష్‌గాయత్రి కళాశాలలో నిర్వహించిన ఎస్టీయూ బద్వేలు ప్రాంతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో పీఆర్సీలు అమలు చేయకుండా జాప్యం చేయడం పాలకులకు అలవాటుగా మారిందన్నారు. 2023 జూలై నుంచి పన్నెండవ పీఆర్సీ అమలు కావల్సి ఉండగా ఇంతవరకూ కమిషన్ ఏర్పాటు గానీ, విధివిధానాలు గానీ ప్రకటించకపోవడం సరికాదన్నారు. పదోన్నతులు చేపట్టి ఉన్నత పాఠశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలే తప్ప బలవంతపు సర్దుబాట్లు సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి పెండింగ్ బకాయిల చెల్లింపుకు వెంటనే చర్యలు చేపట్టాలని,లేని పక్షంలో ఉద్యమం చేపట్టక తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఖాదర్‌బాషా, ప్రమీల, నాగేశ్వరరావులను, ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య భావితరాలకు ఆదర్శం



ప్రొద్దుటూరు : విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రొఫెసర్లు



బద్వేలు అర్బన్ : విశ్రాంత ఇంజినీర్లను సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య భావితరాలకు ఆదర్శమని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్‌డే సందర్భంగా ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు విశ్వేశ్వరయ్య చేసిన కృషి అమోఘమని, ఆయన తన మేధస్సుతో ప్రాజెక్టులను నిర్మింపచేసి రైతులకు ఎంతో మేలు చేశారని కొనియాడారు. నేటితరం ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. అనంతరం విశ్రాంత ఇంజనీర్లు సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, కొండారెడ్డి, రామయ్యను సన్మానించారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంట పుల్లయ్య, కోశాధికారి గంగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.పిచ్చయ్య, సభ్యులు చెంద్రాయుడు, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, శ్రీరాములు, మహబూబ్‌బాషా, లక్ష్మినరసయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం 57వ ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం గేట్ ప్రో సంస్థ వ్యవస్థాపకుడు వీఎస్ఆర్ సురేష్, కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలకు గుర్తుగా సెప్టెంబర్ 15న దేశ వ్యాప్తంగా ఇంజనీర్ల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఇంజినీరింగ్ రంగంలో విశ్వేశ్వరయ్య సేవలు అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మెటలార్జి విభాగాధిపతి ప్రొఫెసర్ హరినాథ్‌రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ నాగేశ్వర్‌రెడ్డి, సివిల్ విభాగాధిపతి ప్రొఫెసర్ సౌజన్య, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగు జోరుగా..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు కరుణించడంతో మండలంలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాల్లోని రైతులు వారం రోజులుగా మినుము, పెసర పంటలను ముమ్మరంగా సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు విత్తనంతో పాటు ఎరువులు వేస్తున్నారు. గతంలో ఈ పంటలకు చీడపీడలు, పురుగులు, తెగుళ్లు ఆశించడంతో దిగుబడి అంతంతమాత్రంగానే వచ్చింది. ధరలు బాగుండటంతో ఈ ఏడాది అధిక దిగుబడులు రావాలని రైతులు కోరుకుంటున్నారు.

–రాజుపాళెం



ట్రాక్టరుతో మినుము విత్తనం వేస్తున్న రైతులు



విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్న మినుములు

ఉండ్రాళ్లయ్యా.. వెళ్లి రావయ్యా!



బద్వేలు అర్బన్: గ్రామోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



ప్రొద్దుటూరు కల్చరల్ : నిమజ్జనానికి తరలిన మహర్షి వీధిలోని గణనాథుడు

బద్వేలు అర్బన్ : వినాయకచవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలకు ఆదివారం కోలాహలంగా నిమజ్జనం నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి, సిద్దవటంరోడ్డులోని ఎన్‌జీఓ కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన గణనాథునికి 9 రోజుల పాటు విశేష పూజలు అందించి ఉండ్రాళ్లయ్యా.. వెళ్లి రావయ్యా అంటూ నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. విగ్రహాలను పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. దారి వెంబడి స్వామికి భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేడుకగా వినాయకుని గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలుప్రాంతాలలో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను ఆదివారం గణపతి ఉత్సవ కమిటీ వారు నిమజ్జనానికి తరలించారు. ఉదయం గణనాథునికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం బొజ్జగణపయ్య విగ్రహాలను ట్రాక్టర్లలో ఎక్కించి పురవీధుల్లో చెక్కభజనలు, డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక బొల్లవరంలోని మహర్షి వీధిలో బొల్లవరం యూత్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా చెక్కభజన, డప్పువాయిద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డూ వేలం పాట నిర్వహించారు. లడ్డూను వేలంలో మణికంఠ రెడ్డి రూ.37 వేలకు చేజిక్కించుకున్నారు. గణనాథుని విగ్రహాలను పెన్నానది, చాపాడు, కామనూరు వద్ద ఉన్న కుందూనదిలో నిమజ్జనం చేశారు.

లడ్డూ వేలం

పోరుమామిళ్ల: పట్టణంలోని చితానందనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ఆదివారం వేలం వేయగా.. పుల్లూరు శివ రూ.50 వేలకు దక్కించుకున్నారు. స్వామి ఆశీస్సులు తమకు ఉంటాయనే భావనతో వేలంలో పాల్గొన్నట్లు శివ తెలిపారు.



పోరుమామిళ్ల: వినాయకుడి లడ్డూను దక్కించుకున్న శివ

19 నుంచి మండల స్థాయి ఎస్జీఎఫ్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఈ నెల 19 నుంచి 21 తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్లు బాబు, ఓబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు అండర్ –14, 17 విభాగంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆర్‌సీపీఈ వ్యాయామ కళాశాలలో 19న ఉదయం 7 గంటలకు అథ్లెటిక్స్, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు, 20న ఉదయం 8 గంటలకు కబడ్డీ, ఖోఖో పోటీలు, 21న కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటలకు వాలీబాల్, యోగా, చెస్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని మరిన్ని వివరాలకు 9440033647, 9490912618 నంబరుకు సంప్రదించాలని కోరారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయొద్దు

మైదుకూరు : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆ నాడు విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సమరశీల పోరాటాలు చేసి, 60 మంది ప్రజాప్రతినిధులు పదవులకు రాజీనామా చేశారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 32 మంది తమ ప్రాణాలను త్యాగం చేయడం వలన విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు అయిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కర్మాగారం ప్రైవేట్ పరం కాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు.

రెండో రోజుకు చేరిన దీక్ష

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్ ఆవరణలోని పెద్దమ్మతల్లి ఆలయ గదులను తొలగించొద్దని కోరుతూ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ రెండో రోజు ఆదివారం ఆలయం వద్ద దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడికి సంబంధించిన వంట గదిని, పూజా సామాన్లను, భోజనశాలను తొలగించాలని మున్సిపల్ ఆదేశించారని తెలిసిందన్నారు. కమిషనర్ ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు బలవంతంగా గదులను తొలగించేందుకు ప్రయత్నిస్తే జరిగే పరిణామాలకు మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన నాయకుడు నారాయణస్వామి, రాజేశ్వరి, సత్యరాజు, వెంకటనారాయణ, రాజేష్, సుబ్బరాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాడి యత్నం ఘటనలో కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : శ్రీనివాసనగర్‌కు చెందిన తెల్లాకుల మనోహర్‌పై దాడికి ప్రయత్నించిన ఘటనలో ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్‌తో పాటు మరికొందరిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలపై ఇటీవల మనోహర్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటూ సుధాకర్ తన దుకాణం వద్దకు వచ్చి బెదిరించినట్లు మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.